సాక్షి అనంతపురం
మంగళవారం । 30 । జనవరి । 2024



సాగులో ఆణి'ముత్యం'

తాడిపత్రి మండలం పెద్ద పొలమడ గ్రామ రైతు నాగరాజు ముత్యాల పంట సాగు చేసి మంచి ఆదాయం పొందుతున్నాడు. 8లో



టమాట కిలో రూ.18

కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.18 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
33.4°/15.3°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి కొనసాగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

సజావుగా వీఏహెచ్‌ఏ సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: విలేజ్ అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్ (ఏహెచ్‌ఏఏ) పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా రెండో విడతలో అర్హత పొందిన 240 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన సోమవారం ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లాకు సంబంధించి అనంతపురంలోని పశుశాఖ జేడీ కార్యాలయంలో అభ్యర్థుల సర్టిఫికెట్లను రెండు జిల్లాల జేడీలు డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం, డాక్టర్ శుభదాస్ సమక్షంలో డీడీలు డాక్టర్ వై.రమేష్‌రెడ్డి, డాక్టర్ సత్యరాజ్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ టి.సుధాకర్ నేతృత్వంలో పలువురు ఏడీలు, పశువైద్యులు, క్లరికల్ స్టాఫ్‌తో కూడిన ఆరు బృందాలు నిశితంగా పరిశీలించాయి. ఉమ్మడి జిల్లాలో 473 పోస్టులకు 919 మంది అభ్యర్థులు గత నెల 31 ఆన్‌లైన్ పరీక్షకు హాజరైన విషయం తెలిసిందే. డైరెక్టరేట్ పరిధిలోనే మెరిట్, రోస్టర్, కటాఫ్ మార్కులు ఆధారంగా తొలివిడతలో 206 మంది అభ్యర్థులు అర్హత సాధించగా, సర్టిఫికెట్ల పరిశీలనలో 205 మంది పోస్టులు దక్కించుకున్నారు. తాజాగా రెండో విడత కింద 240 మంది అభ్యర్థులకు సంబంధించి సోమవారం సర్టిఫికెట్ల పరిశీలన సజావుగా సాగింది. ఇప్పటికే పనిచేస్తున్న వీఏహెచ్‌ఏల బదిలీలు పూర్తి చేసి బుధవారం కొత్త వారికి పోస్టింగ్ ఇవ్వనున్నారు.

మహిళలకు నేడు ప్రత్యేక ఉద్యోగ మేళా

అనంతపురం: ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 30న మహిళలకు ప్రత్యేక ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పది ఉత్తీర్ణత మొదలు.. డిగ్రీ వరకూ చదువుకున్న 18 నుంచి 26 సంవత్సరాల వయసున్న నిరుద్యోగ మహిళలు అర్హులు. ఎంపికైన వారు కర్ణాటకలోని కోలారులో మొబైల్, ఎలక్ట్రానిక్ తయారీ సంస్థలో టెక్నికల్ ఆపరేటర్లు, ప్రొడక్షన్ ఆపరేటర్లుగా పనిచేయాల్సి ఉంటుంది. ఆసక్తి ఉన్న వారు అనంతపురం శివారులోని ఆర్డీటీ స్టేడియం ఎదురుగా ఉప్పరపల్లి రోడ్డులో ఉన్న ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌కు మంగళవారం ఉదయం విద్యార్హత సర్టిఫికెట్లు, బయోడేటాతో నేరుగా హాజరు కావాలి.

నిర్దేశిత గడువులోపు పరిష్కారం చూపండి : ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం: స్పందన కార్యక్రమంలో బాధితులు అందజేసిన వినతులకు నిర్దేశిత గడువులోపు పరిష్కారం చూపాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 148 వినతులు అందాయి. నేరుగా, సచివాలయాల (వర్చువల్/జూమ్) ద్వారా అర్జీలను స్వీకరించారు. జిల్లా పోలీసుల కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ అన్బురాజన్ స్వయంగా అర్జీదారులతో వినతులు స్వీకరించి, సమస్య తీవ్రతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వర్చువల్ విధానంలో సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో మాట్లాడారు. స్పందన అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఏదైనా సమస్య తలెత్తితే జిల్లా పోలీసు స్పందన విభాగం 93929 26803కు కాల్ చేసి సంప్రదించవచ్చన్నారు.

బాలల బీమాతో భరోసా

- ప్రమాదవశాత్తు మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు ఆసరా
- రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా 'అనంత'లో బాలల బీమా అమలు
- ఇప్పటిదాకా 370 కుటుంబాలకు రూ. 92.50 లక్షల పంపిణీ
- ఈ ఏడాది ప్రీమియం చెల్లింపునకు 31 తుది గడువు





బాలల బీమా చెక్కు పంపిణీ చేస్తున్న సమగ్ర శిక్ష ఏపీసీ వరప్రసాదరావు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వారిలో నిరుపేద కుటుంబాల నుంచి వచ్చిన పిల్లలే అధికం. విధి వక్రించి ప్రమాదవశాత్తూ ఎవరైనా చనిపోతే తల్లిదండ్రులు కడుపుకోతతో దిక్కుతోచని స్థితిలో మానసిక సంఘర్షణకు లోనవుతారు. ఓ వైపు ఆర్థిక భారమైన ఆ కుటుంబాలు, మరోవైపు గుండె కోతకు గురైతే పోయిన బిడ్డలను తెచ్చివ్వలేము కానీ కొంతలో కొంతగా అండగా ఉంటే వారి కుటుంబాలకు ఆసరా ఉంటుందనే మంచి ఆలోచనతో అప్పటి జిల్లా కలెక్టరు బుసిరెడ్డి జనార్దన్‌రెడ్డి 'బాలల బీమా' పథకానికి శ్రీకారం చుట్టారు. తెలుగు రాష్ట్రాల్లో ఏ జిల్లాలోనూ లేనివిధంగా అనంతపురం జిల్లాలో మాత్రమే ఈ పథకం అమలవుతోంది. 2010 నవంబరు 11న ఈ పథకం రూపుదిద్దుకుంది. మన జిల్లాకంటే ముందు కర్నూలు, మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ బాలల బీమా పథకం అమలుకు శ్రీకారం చుట్టినా ఆశించిన ఫలితాలు రాలేదు. ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, రెసిడెన్షియల్, ఆదర్శ పాఠశాలలు, కస్తూరిబా బాలికా విద్యాలయాలు, నవోదయ, కేంద్రీయ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ ఈ పథకం వర్తిస్తుంది.

ప్రీమియం చెల్లింపు ఇలా...

విద్యార్థులు చెల్లించాల్సిన ప్రీమియం ప్రారంభంలో ఒక్కొక్కరు ఏడాదికి రెండు రూపాయలు. రెండో సంవత్సరం (2011–12) నుంచి ప్రీమియం రూ.2 నుంచి రూ.5కు పెంచారు. ప్రమాదవశాత్తూ అంటే రోడ్డు ప్రమాదాలు, నీటమునక, విద్యుదాఘాతం, పాము, తేలు, కుక్కకాటు తదితర కారణాలతో మరణించినా, వైకల్యం బారిన పడినా బీమా మొత్తం పొందేందుకు అర్హులు. చనిపోయినా, పూర్తి వైకల్యం చెందినా రూ.25 వేలు, కొంతమేర వైకల్యం చెందితే రూ.10 వేలు బీమా మంజూరవుతుంది. హెచ్‌ఎం తమ పాఠశాలలో నమోదైన ప్రతి విద్యార్థి నుంచి బీమా ప్రీమియం సేకరించి సంబంధిత ఎంఈఓ ద్వారా సమగ్ర శిక్ష కార్యాలయానికి అందేలా చూడాలి. వారు ఇన్సూరెన్స్ కంపెనీకి చెల్లిస్తారు. పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటిదాకా ప్రమాదవశాత్తూ మృతి చెందిన 370 మంది విద్యార్థుల కుటుంబాలకు రూ.92.50 లక్షలు పంపిణీ చేశారు.

వెంటనే సమాచారం అందించాలి

ప్రమాదం జరిగిన వెంటనే పాఠశాల హెచ్‌ఎం, ఎంఈఓ, సీఆర్పీ, ఎంఐఎస్ కోఆర్డినేటరు, డేటా ఎంట్రీ ఆపరేటరు బాలల బీమా సమన్వయకర్తకు సమాచారం అందించాలి. వారు ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులకు విషయాన్ని చేరవేస్తారు. ఫలితంగా బీమా మొత్తం వెంటనే వచ్చేందుకు సులువవుతుంది. కొందరు ప్రజాప్రతినిధులు స్పందించి వారివారి మండలాలు, నియోజకవర్గాల పరిధిలోని విద్యార్థులకు సంబంధించి ప్రీమియం మొత్తం చెల్లిస్తున్నారు.

కొరవడిన ప్రచారం

పిల్లలకు ఈ స్థాయిలో ఉపయోగపడే బాలల బీమా పథకం గురించి ప్రచారం చేయడంలో సమగ్ర శిక్ష అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. మండల అధికారులతో సమగ్ర శిక్ష అధికారులు సమన్వయం చేయని కారణంగా పలువురు విద్యార్థులు ఈ పథకానికి దూరమయ్యారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. గతంలో ప్రీమియం చెల్లింపునకు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లేవారు. ఇప్పుడు ఈ పథకం గురించి చెప్పేవారే కరువయ్యారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని అన్ని స్కూళ్లకూ సమాచారం చేరవేసేలా చూడాలని పలువురు ఉపాధ్యాయులు కోరుతున్నారు.

31లోగా ప్రీమియం చెల్లించాలి

2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రీమియం చెల్లించేందుకు ఈ నెల 31 వరకు గడువు ఉంది. ప్రతి విద్యార్థి నుంచి ప్రీమియం చెల్లించేలా పాఠశాల హెచ్‌ఎం, ఎంఈఓలు చర్యలు తీసుకోవాలి. హెచ్‌ఎం సకాలంలో ప్రీమియం చెల్లించేలా చొరవ చూపాలని అధికారులు కోరుతున్నారు.

సిలిండర్ సరఫరాకు అ'ధనం' వసూలు చేయరాదు

- ఉల్లంఘించే ఏజెన్సీలపై కఠిన చర్యలు



జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్ : వినియోగదారులకు వంట గ్యాస్ సిలిండర్ సరఫరా చేసే క్రమంలో అదనంగా డబ్బు వసూలు చేయకూడదని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఏజెన్సీలను ఆదేశించారు. ఇందుకు సంబంధించి వివరాలను సోమవారం తెలియజేశారు. సిలిండర్ సరఫరాకు అదనంగా డబ్బు ఇవ్వాలని డెలివరీ బాయ్స్ డిమాండ్ చేస్తే సంబంధిత తహసీల్దారు లేదా జిల్లా పౌర సరఫరాల అధికారికి వినియోదారులు ఫిర్యాదు చేయాలన్నారు. లేని పక్షంలో టోల్‌ఫ్రీ నంబర్ 1967 లేదా ఆయిల్ ఫ్రీ (గ్యాస్ కంపెనీలకు సంబంధించి) నంబర్ 18002333555కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన గ్యాస్ ఏజెన్సీలపై సంబంధిత అధికారులతో విచారణ చేయించి వాస్తవమని నిర్ధారణ అయితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రభుత్వ ఉత్తర్వులు ఇలా....

సిలిండర్ సరఫరా చార్జీ వసూలుపై గ్యాస్ పంపిణీదారులకు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది.

- నగరాలు, పట్టణాల్లో రవాణా చార్జీలు వసూలు చేయకూడదు.
- మునిసిపల్ పరిధి నుంచి 15 కిలో మీటర్ల పరిధిలోని గ్రామాల్లో డెలివరీకి వసూలు చేయరాదు.
- డీలర్ పరిధి నుంచి 15 కిలో మీటర్ల పరిధిలోని గ్రామాల్లో డెలివరీకి చార్జీ వసూలు చేయకూడదు.
- కష్టతరమైన, ప్రత్యేక ప్రాంతాలు (కొండ, అటవీ, తక్కువ జనాభా ఉన్న ప్రాంతాలు)లోనూ డెలివరీ చార్జీ వసూలు చేయకూడదు.
- గ్యాస్ సిలిండర్ సరఫరా విషయంలో 15 కిలోమీటర్లు మించి ఎక్కువ దూరం ఉంటేనే వినియోదారుల నుంచి డెలివరీ చార్జీలు వసూలు చేయాలి.

కచ్చితమైన పరిష్కారం చూపాలి



అర్జీదారు సమస్యను వింటున్న కలెక్టర్ గౌతమి. చిత్రంలో జేసీ కేతన్‌గార్గ్ తదితరులు

- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం

అనంతపురం అర్బన్: 'స్పందన', 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాల్లో ప్రజల నుంచి అందే అర్జీలకు కచ్చితమైన పరిష్కారం చూపించాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడి సమస్య గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలని సూచించారు. అర్జీల పరిష్కార క్రమంలో ఏ దశలోనూ నిర్లక్ష్యానికి తావివ్వకూడదని చెప్పారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన 'స్పందన'లో కలెక్టర్.. జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, జెడ్పీ సీఈఓ వైభోమ్ నిదియాదేవి, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, ఆర్డీఓ గ్రంధి వెంకటేష్, డిప్యూటీ కలెక్టర్లు వరప్రసాద్, ఆనంద్, డీఎల్‌డీఓ ఓబుళమ్మతో కలిసి ప్రజల నుంచి వివిధ సమస్యలపై 450 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమం అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా వారి సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. అర్జీల పరిష్కారంపై జిల్లా అధికారులు రోజూ తమ శాఖ సిబ్బందితో సమీక్షించాలన్నారు. గడువు కంటే ముందే అర్జీలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అర్జీల్లో మచ్చుకు కొన్ని...

తన పేరున ఉన్న భూమి రిజిస్టర్ కావడం లేదని బ్రహ్మసముద్రం మండలం ఎర్రకొండాపురం గ్రామానికి చెందిన జి.సావిత్రమ్మ అర్జీ ద్వారా విన్నవించారు. గ్రామ పొలం సర్వే నంబరు 10–2 హెచ్‌లో 6 ఎకరాలు, 10–2ఎఫ్‌లో 2 ఎకరాల భూమి తన పేరున ఉందని చెప్పారు. ఇది పూర్వ పట్టా భూమి అయినప్పటికీ తన పేరున రిజిస్టర్ కావడం లేదని తెలిపారు. తహసీల్దారు కార్యాలయంలో అడిగితే స్పెషల్ కరెక్షన్ కోసం జేసీ లాగిన్ లో ఉందని చెబుతున్నారన్నారు. తన సమస్యను పరిష్కరించాలని కోరారు.

- అనేక ఏళ్లుగా తాము సాగు చేసుకుంటున్న భూమికి పట్టా మంజూరు చేయాలని పుట్లూరు మండలం చింతకుంటకు చెందిన పెద్దక్క విన్నవించారు. గ్రామ పొలం సర్వే నెంబరు 266లో 3.62 ఎకరాల భూమి తమ అనుభవంలో ఉందని, ఇందుకు పట్టాదారు పాసుపుస్తకం, 1–బి, అడంగల్ కూడా ఉన్నాయని చెప్పారు. రీ–సర్వేలో ఈ భూమి మిగులు భూమిగా చేర్చారన్నారు. ఏళ్లగా సాగు చేసుకుంటున్న ఈ భూమిపై తమకు డి.పట్టా మంజూరు చేయాలని కోరారు.
- తన పేరున ఉన్న భూమిని ఆన్‌లైన్‌లో నమోదు అయ్యేలా ఆదేశాలివ్వాలని ఆత్మకూరు మండలం వడ్డుపల్లికి చెందిన గుడిపాటి శ్రీనివాసులు విన్నవించారు. సర్వే నంబరు 152–1బిలో 3.33 ఎకరాల భూమి తనకు ఉందని, ఇందుకు అన్ని ఆధారాలూ ఉన్నాయని చెప్పారు. వీటిని పరిశీలించి భూమిని తన పేరున ఆన్‌లైన్‌లో నమోదు చేయించి న్యాయం చేయాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో అద్భుత ఫలితాలు

- అంతర్జాతీయ వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం



గోవిందవాడ ఇసుక నేలల్లో పంటలను పరిశీలిస్తున్న బృందం సభ్యులు



బీజా మృతం, ఘన, ద్రవ జీవామృతం, గుళికల గురించి వివరిస్తున్న డీపీఎం లక్ష్మానాయక్

రాప్తాడు/బొమ్మనహాళ్: జిల్లాలో ప్రకృతి వ్యవసాయం అద్భుత ఫలితాలిస్తోందని అంతర్జాతీయ వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం పేర్కొంది. షేక్ మజీద్, అలఖ్ అస్సీమి (షార్జా), ఫ్యూచర్ ఎకనమిక్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు వాల్టర్ లింక్, షేక్ మజీద్ అసోసియేట్ యాజెన్ అల్‌కొద్మని (ఇటలీ) ప్రపంచబ్యాంక్ సీనియర్ సలహాదారులు నలిన్ కిషోర్, అశోక్ వైష్, జేశదీప్ సహదేవ్ (అమెరికా)తో కూడిన బృందం సోమవారం మరూరులో పర్యటించింది. రైతు బాలముద్దన్న 1.25 ఎకరాల విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయ విధానం ద్వారా సాగు చేసిన మామిడితో పాటు అంతర పంటలుగా 25 రకాల పండ్లు, పూల తోటలను వారు పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయంలో వినియోగించే జీవ ఎరువుల తయారీపై బీజామృతం, ద్రవ, ఘన జీవామృతం, విత్తన గుళికల తయారీ గురించి రైతును అడిగి తెలుసుకున్నారు. మామిడి, అంతర పంటల సాగు పద్ధతి బాగుందని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్‌కుమార్, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు జిల్లా మేనేజర్ (డీపీఎం) లక్ష్మానాయక్ రైతును ప్రశంసించారు. టి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ జీవ వైవిధ్య, విత్తన గుళికల తయారీ రైతు సాధికార సంస్థ ప్రత్యేకతలని, ఈ విధానాల వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయని అన్నారు. జీవ ఎరువుల వినియోగం వల్ల నేలలో బ్యాక్టీరియాతో పాటు మైక్రో రైజోబియం వృద్ధి చెంది వానపాముల సంఖ్య గణనీయంగా పెరగడంతో నేల మృదువుగా తయారై పంటలకు అనుకూలంగా ఉంటుందన్నారు. జీవ ఎరువుల వల్ల వ్యవసాయ క్షేత్రంలో నీటిని నిల్వ చేసే సామర్థ్యం కూడా పెరిగి ప్రకృతి విపత్తులకు తట్టుకొనే శక్తిని ప్రసాదిస్తుందని అన్నారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శామ్యూల్ ఆనంద్, థిమాటిక్ లీడ్ సురేష్, ఎన్‌ఎఫ్‌ఏలు భానుమతి, విజయ్, సిబ్బంది రాజారావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

- అంతర్జాతీయ వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం బొమ్మనహాళ్ మండలం గోవిందవాడ, కల్లుదేవనహళ్లి శివారులోని ఇసుక దిబ్బలలో రైతులు వన్నూరుస్వామి, రాజు, మల్లికార్జున, మల్లప్ప ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేసిన పంటలను పరిశీలించింది. రైతుల అనుభవాలను తెలుసుకున్నారు. కంది, ఆముదం, అలసంద, అనుములు, గోరు చిక్కుడు, సజ్జ విత్తనాలతో ఘన జీవామృతంతో పాటు విత్తనాలు విత్తుకునే విషయాలపై, ఆదాయం పొందే విధానాలపై చర్చించారు. కార్యక్రమంలో ఏఓ కృష్ణ చైతన్య, డీఎల్‌ఎంపీ నరేంద్రకుమార్, జిల్లా కోఆర్డినేటర్ భానుమతి తదితరులు పాల్గొన్నారు.

పలువురు సీఐల బదిలీ

అనంతపురం: అనంతపురం రేంజ్ పరిధిలో పలువురు సీఐలలు బదిలీ అయ్యారు. ఈ మేరకు డీఐజీ ఆర్.ఎన్.అమ్మిరెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌లో ఉన్న బి.కాంతికుమార్ అనంతపురం టూటౌన్, ఎస్.రోషన్ యాడికి సర్కిల్, పి.సుబ్బరామిరెడ్డి నగరి రూరల్ సర్కిల్, కె.జనార్దన అనంతపురం సీసీఎస్, డి.మునిస్వామి రాప్తాడు యూపీఎస్, ఎం.రాజగోపాల్ పాకాల యూపీఎస్, హెచ్.కృష్ణమరాజునాయక్ ముదిగుబ్బ సర్కిల్‌కు బదిలీ అయ్యారు. అనంతపురం టూటౌన్ సీఐ జి.శివరాముడు కూడేరు యూపీఎస్‌కు, ముదిగుబ్బ సర్కిల్ నుంచి పి.యతీంద్ర ముదిగుబ్బ యూపీఎస్‌కు బదిలీ చేశారు. నగరి రూరల్ సీఐ కె.శ్రీనివాసంతిని వీఆర్‌పై అనంతపురం ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేశారు.

జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి మృతి

- పలువురు ప్రముఖుల నివాళి
- నేడు కమలపాడులో అంత్యక్రియలు



మృతదేహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు (ఇన్‌సెట్‌లో) రాజశేఖర్‌రెడ్డి (ఫైల్)

వజ్రకరూరు: జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ టి.రాజశేఖర్‌రెడ్డి (67) మృతి చెందారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున తుదిశ్వాస విడిచారు. ఇదే రోజు సాయంత్రం మృతదేహాన్ని స్వగ్రామమైన వజ్రకరూరు మండలం కమలపాడుకు తీసుకొచ్చారు. రాజశేఖర్‌రెడ్డి కాంగ్రెస్ తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చురుగ్గా పనిచేశారు. 2022లో అగ్రి అడ్వైజరీ బోర్డు జిల్లా చైర్మన్‌గా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం కల్పించారు. భార్య టి.శైలజారెడ్డి 2006 నుంచి 2011 వరకు వజ్రకరూరు ఎంపీపీగా పనిచేశారు. వీరికి ఇద్దరు కుమారులు సందీప్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి ఉన్నారు. మంగళవారం ఉదయం పది గంటలకు కమలపాడులో రాజశేఖర్‌రెడ్డి అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రముఖుల నివాళి : జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి మరణ వార్త వైఎస్సార్‌సీపీ నేతలను దిగ్భ్రాంతికి గురి చేసింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు కమలపాడుకు చేరుకుని మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి ఫోన్ ద్వారా రాజశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తోపుదుర్తి కవిత, పార్టీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి తదితరులు మృతుని నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. పీఏసీఎస్ చైర్మన్ సుధీర్‌రెడ్డి, మాజీ చైర్మన్లు భీమిరెడ్డి, నారాయణరెడ్డి, ఉరవకొండ ఎంపీపీ నరసింహులు, నాయకులు రాకెట్ల అశోక్, తిమ్మారెడ్డి, ఎఫ్‌పీఓ చైర్మన్ అమర్‌నాథ్ తదితరులు గ్రామానికి చేరుకుని నివాళులర్పించారు.

క్లుప్తంగా

రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల తనిఖీ



చెక్‌పోస్టు సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ ఆర్.విజయభాస్కరరెడ్డి

అనంతపురం: కర్ణాటక నుంచి జిల్లాలోకి ప్రవేశించే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని చెక్‌పోస్టు సిబ్బందిని అదనపు ఎస్పీ ఆర్.విజయభాస్కరరెడ్డి ఆదేశించారు. కుందుర్పి మండలం బెస్తరపల్లి, కంబదూరు వద్ద ఉన్న అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులను సోమవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఇప్పటి నుంచే చెక్‌పోస్టుల్లో నిఘా కట్టుదిట్టం చేయాలన్నారు. కర్ణాటక మద్యం, బంగారం, నగదు అక్రమ తరలింపును సమర్థవంతగా అడ్డుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులు, సీఐ నాగరాజు ఉన్నారు.

ప్రమాదంలో యువకుడి మృతి



కిరణ్ (ఫైల్)

గుత్తి: ద్విచక్ర వాహనం బోల్తాపడిన ఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. కర్నూలు జిల్లా పోలీసులు తెలిపిన మేరకు... గుత్తిలోని ఎస్‌బీఐ కాలనీకి చెందిన కిరణ్ (23)కు భార్య కవిత, ఏడాది వయసున్న కుమార్తె ఉన్నారు. పార్ట్‌టైమ్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో తన స్నేహితుడు మల్లేష్‌తో కలసి శివమాల ధరించేందుకు ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై నంద్యాల జిల్లా యాగంటిలోని శైవ క్షేత్రానికి బయలుదేరారు. ప్యాపిలి సమీపంలో యాగంటి రోడ్డు మలుపు వద్దకు చేరుకోగానే 44వ జాతీయ రహదారిపై వేగ నియంత్రణ కోల్పోవడంతో ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలోకి దూసుకెళ్లింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన కిరణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మల్లేష్‌కు రెండు కాళ్లూ విరిగాయి. క్షతగాత్రుడిని కర్నూలులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై కర్నూలు జిల్లా ప్యాపిలి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రైలు ఢీకొని వ్యక్తికి వైకల్యం



బాధితుడు మల్లికార్జున

రాయదుర్గంటౌన్: రైలు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి రెండు కాళ్లూ పూర్తిగా తెగిపడ్డాయి. వివరాలు... రాయదుర్గంలోని సిద్దేశ్వర కాలనీకి చెందిన మల్లికార్జునకు భార్య, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. కుట్టు కార్మికుడిగా జీవనం సాగిస్తున్న మల్లికార్జున మూడేళ్లుగా కంటి చూపు సమస్యతో ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలో టైలరింగ్ వృత్తికి దూరంగా ఇంటి వద్దనే ఖాళీగా ఉంటున్నాడు. భార్య కూలి పనులకు వెళ్లి సంసార బాధ్యతలు చూసుకుంటోంది. ఈ క్రమంలో కంటి చూపు సక్రమంగా లేని మల్లికార్జున సోమవారం ఉదయం బళ్లారి రోడ్డు సమీపంలో రైల్వే ట్రాక్‌పై రైలు రాకను గమనించకుండా పట్టాలు దాటే ప్రయత్నం చేశాడు. అదే సమయంలో రైలు ఢీకొనడంతో రెండు కాళ్లూ శరీరం వేరుపడ్డాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే క్షతగాత్రుడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తీసుకెళ్లారు. ఘటనపై గుంతకల్లు రైల్వే పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సాగులో ఆణి'ముత్యం'

సంప్రదాయ పంటల సాగుతో ఆ రైతు విసుగెత్తాడు. ఏదైనా కొత్త పంట సాగుచేయాలని ఆలోచిస్తున్న తరుణంలో యూట్యూబ్ ఆయనకు దారి చూపింది. ముత్యాల సాగు వైపు నడిపించింది. వేరే రాష్ట్రాల్లో శిక్షణకు వెళ్లేలా పురిగొల్పింది. ఎంతో ఉత్సాహంగా సాగు చేసిన పంట మొదటి సారి నిరాశే మిగిల్చినా, పట్టు వదలని రా'రాజు'లా పరిశ్రమించిన ఆయనకు లాభాలు తెచ్చిపెట్టింది.

- మంచినీటిలో వినూత్నంగా ముత్యాల సాగు
- పొలమడకు చెందిన నాగరాజు వినూత్న ప్రయత్నం
- పంట పండితే 3 రెట్ల ఆదాయం



కొత్తగా ముత్యాల సాగు చేస్తున్న నీటికుంట



సాగులో ఉన్న ఆల్చిప్పలను చూపుతున్న నాగరాజు



పండించిన ముత్యాలను చూపుతున్న నాగరాజు

తాడిపత్రిటౌన్: తాడిపత్రి మండలం పెద్ద పొలమడ గ్రామానికి చెందిన నారాయణమ్మ, నల్లప్ప దంపతుల కుమారుడు నాగరాజుది సాధారణ వ్యవసాయ కుటుంబం. తమకున్న 7 ఎకరాల పొలంలో చాలా కాలం సంప్రదాయ పంటలు సాగు చేసేవారు. నిత్యం వైవిధ్యంగా ఆలోచించే నాగరాజుకు ఇది నచ్చేది కాదు. ఏవైనా వెరైటీ పంటలు సాగు చేసి, 10 మందిలో తనకంటూ ఓ గుర్తింపు పొందాలని తాపత్రయపడేవాడు. ఈ క్రమంలోనే ఒక రోజు తన సెల్‌లో యూట్యూబ్ వీడియోలు చూస్తుండగా, ముత్యాల సాగు గురించి కనిపించింది.

వేరే రాష్ట్రాలకు వెళ్లి.. శిక్షణ తీసుకుని..

ఆ రోజు రాత్రంతా నాగరాజుకు అదే తలంపు. ఎలాగైనా తాను కూడా ముత్యాలు సాగు చేయాలని నిశ్చయించుకున్నాడు. మళ్లీ సెల్‌లో ఆ విషయం గురించి ఆరా తీయడం ప్రారంభించాడు. రాష్ట్రంలో ఎక్కడా ఆ సాగుపై శిక్షణ ఇచ్చేవారు కనిపించలేదు. కలకత్తా, కోయంబత్తూర్ వంటి నగరాల్లో ఇస్తారని తెలుసుకున్నాడు. దీంతో నాగరాజు అక్కడికే వెళ్లాడు. 3 నెలల పాటు శిక్షణ తీసుకున్నాడు. అనంతరం గ్రామానికి తిరిగొచ్చి ఎంతో ఉత్సాహంగా ఇంట్లోనే ముత్యాల సాగు ప్రారంభించాడు.

నష్టాలతో మొదలు..

2017లో దాదాపు రూ. లక్ష వ్యయంతో సాగులో అడుగులు వేసిన నాగరాజుకు నష్టాలే పలకరించాయి. గదిలో తొట్టె ఏర్పాటు చేసి 3 వేల ఆల్చిప్పలు పెంచగా.. దాదాపు 2 సంవత్సరాలకు దిగుబడి వచ్చింది. అయితే, సాగులో పెద్దగా అనుభవం లేకపోవడంతో ఆశించిన ఫలితం రాలేదు. అయినా, నాగరాజు ఏమాత్రం నిరాశ పడలేదు. తల్లిదండ్రులు కూడా కుమారుడిని ఎక్కడా నిరుత్సాహపరచక ప్రోత్సహించారు. దీంతో మళ్లీ నాగరాజు ముత్యాల సాగు కొనసాగించాడు. 2021లో మరోసారి ఎల్-మార్జీలీస్, ఎల్- కొరియన్స్ అనే రకం సాగు ప్రారంభించాడు. తన కష్టానికి తగిన ఫలితం దక్కింది. రెండు సంవత్సరాలకు దిగుబడి వచ్చింది. ఆన్‌లైన్ ద్వారా లేదా సూరత్, ఢిల్లీ, కలకత్తా నగరాల్లో ముత్యాలను విక్రయించాడు. ఒక్కో ముత్యం రూ.50 నుంచి రూ. 100 వరకూ అమ్ముడుబోయింది. మేలైన రకాల ముత్యాలకు రూ.500 వరకు విక్రయించాడు. దీంతో దాదాపు రూ. 6 లక్షల ఆదాయం వచ్చింది.

పెద్ద ఎత్తున సాగు..

లాభాలు వరించడంతో ముత్యాల సాగుపై నాగరాజుకు నమ్మకం పెరిగింది. ఈ సారి పెద్ద ఎత్తున సాగుకు ఉపక్రమించాడు. ఇందుకోసం చిన్నపోలమడ వద్ద పెన్నానది సమీపంలో అర ఎకరా స్థలం అద్దెకు తీసుకుని నీటి కుంట ఏర్పాటు చేసుకున్నాడు. తాడిపత్రికి దగ్గర్లో ఉన్న గండికోట రిజర్వాయర్, దగ్గర్లో ఉన్న చిన్నపాటి చెరువుల నుంచి విత్తన ఆల్చిప్పలను సేకరించడం ప్రారంభించాడు. ఈ క్రమంలోనే అక్కడి కొందరు మత్స్యకారులను పరిచయం చేసుకుని, వారి ద్వారా ఒక్కో ఆల్చిప్పకు రూ.3 నుంచి రూ. 5 చెల్లించి విత్తన ఆల్చిప్పలను సేకరించుకుని దాదాపు 30 వేల ఆల్చిప్పలు సాగు చేస్తున్నాడు. వచ్చే ఏడాది దిగుబడి అందుతుందని, మళ్లీ మంచి ఆదాయం రావడం ఖాయమని నాగరాజు తెలిపాడు.

ఆసక్తి ఉన్న వారికి శిక్షణ..

రాజుల కాలం నుంచే ముత్యాలకు ఎంతో ఆదరణ ఉండేది. చిన్నపాటి పెట్టుబడితోనే ముత్యాల సాగులో మంచి లాభాలు గడించవచ్చు. వెయ్యి ఆల్చిప్పలు సాగు చేయడానికి కేవలం రూ. 30 వేలు పెట్టుకుంటే చాలు. బాగా కాపాడుకుంటే అంతకు రెట్టింపు లాభాలు గడించవచ్చు. ఈ విషయం చాలా మందికి తెలియదు. ఏదైనా విభిన్న పంటలు చేయాలనే తలంపే నన్ను ఇటువైపు నడిపించింది. ఆన్‌లైన్ ద్వారానే విక్రయాలు చేపడుతున్నా. ముత్యాల సాగుపై ఆసక్తి ఉన్న రైతులు సంప్రదిస్తే ఉచితంగా శిక్షణ అందిస్తా.

జనవాక్కు

రూ.2.48 లక్షల లబ్ధి చేకూరింది



కరోనా సమయంలో పనుల్లేక పూట గడవక నానా ఇబ్బందులు పడ్డాం. ఆ సమయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మమ్మల్ని ఆదుకున్న తీరు ఇప్పటికీ మరువలేకున్నాం. ఇంటి వద్దకే వలంటీర్లు వచ్చి అన్ని రకాల సేవలు అందజేశారు. ఉచిత బియ్యం అందజేసి మా ఆకలి తీర్చారు. అవసరమైన మందులు తెచ్చిచ్చారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వివిధ పథకాల ద్వారా మా కుటుంబానికి రూ.2,48,500 లబ్ధి చేకూరింది. ఇందు కోసం ఏ ఒక్కరినీ నేను ప్రాధేయపడలేదు. ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. మా అవసరాలు ఏమిటో వలంటీర్ల ద్వారా అడిగి తెలుసుకుని తీరుస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మేమెంతో రుణపడి ఉన్నాం. ఆయనకే మా మద్దతు.

– పెద్దింటి గౌరమ్మ, రంగచేడు, గుమ్మఘట్ట మండలం

రైతులను ఆదుకున్నారు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు మంచి రోజులు వచ్చాయి. పంటల సాగుకు 'రైతు భరోసా' పథకం ఎంతో దన్నుగా ఉంటోంది. గతంలో పంటల సాగుకు పెట్టుబడి కోసం చాలా ఇబ్బందులు పడేవాళ్లం. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత ఖరీఫ్ సీజన్ ఆరంభానికి ముందే రూ. 5,500, రెండో విడతలో రూ. 2 వేలు చొప్పున మొత్తం రూ. 7,500 రైతుల ఖాతాల్లోకి జమ అవుతోంది. దీంతో పంటల సాగు ఎంతో సులువుగా మారింది. ఆర్‌బీకేల ద్వారా ఎరువులు, వ్యవసాయ పరికరాలు అందిస్తున్నారు. సబ్సిడీ విత్తన వేరుశనగను మా పంచాయతీలోనే అందజేస్తున్నారు. రైతులకు మేలు చేస్తున్న సీఎం జగన్‌కే మా మద్దతు.

– నరసింహారెడ్డి, కుర్లపల్లి, లేపాక్షి మండలం

బట్టలూడదీయించి.. నరకం చూపించి

పిల్లల చదివిస్తూ ఆలనాపాలనా చూడాల్సిన వార్డెన్ దారి తప్పాడు. మద్యం తాగిన తర్వాత సైకోలా మారిపోతున్నాడు. విద్యార్థులను గదికి రప్పించుకుని బట్టలూడదీయించి నరకం చూపిస్తున్నాడు. ఎవరికైనా చెబితే మరింత పనిష్మెంట్ ఉంటుందని బెదిరించి శాడిజం ప్రదర్శిస్తున్నాడు. చివరకు విద్యార్థుల నుంచి సమాచారం అందుకున్న తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

- కార్పొరేట్ హాస్టల్ వార్డెన్ అరాచకం...
- మద్యం మత్తులో విద్యార్థులపై దాష్టీకం
- తన గదినే బార్‌గా మార్చేసిన ఘనుడు





బార్‌ను తలపిస్తున్న హాస్టల్ వార్డెన్ గది, ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: అనంతపురం రూరల్ మండలం కొడిమి సమీపంలో సంసిద్ ఇంటర్నేషనల్ (సబీఎస్ఈ) స్కూల్ నిర్వహిస్తున్నారు. స్కూల్ ఆవరణలోనే హాస్టల్ కూడా ఉంది. విజయశంకర వరప్రసాద్ అనే వ్యక్తి హాస్టల్ వార్డెన్‌గా పనిచేస్తున్నారు. ఈయన వార్డెన్ విధులను పక్కన పెట్టి ఒక సైకోలా ప్రవర్తిస్తున్నాడు. మద్యానికి బానిసైన ఇతను తన గదిని బార్‌లా మార్చేశాడు. బయటి నుంచి మద్యం తెచ్చుకోవడం గదిలోనే పూటుగా తాగడం.. ఆ మత్తులో రోజూ కొంతమంది విద్యార్థులను గదికి రప్పించుకుని వికృత చేష్టలకు పాల్పడటం పరిపాటిగా మార్చుకున్నాడు. వార్డెన్ దెబ్బలకు తట్టుకోలేక కొందరు విద్యార్థులు తమ తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లారు. నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాలు, పటిష్ట నిఘాతో కూడిన పర్యవేక్షణ ఉంటుందని పంపితే వార్డెన్ ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడటంపై తల్లిదండ్రులు రగిలిపోయారు. ఆదివారం రాత్రి డయల్ 100కు ఫిర్యాదు చేశారు. పోలీసులు హాస్టల్ వద్దకు వస్తున్న విషయం తెలుసుకున్న వార్డెన్ అక్కడి నుంచి పరారయ్యాడు. పోలీసులు వార్డెన్ గదిని తనిఖీ చేయగా అక్కడ తాగి పడేసిన మద్యం బాటిళ్లు వందల సంఖ్యలో కనిపించాయి.

వార్డెన్‌పై కేసు నమోదు..

విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు వార్డెన్ విజయశంకర్ వరప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు అనంతపురం రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. వార్డెన్ పరారీలో ఉన్నాడన్నారు. అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాన్ని రంగంలోకి దింపామని చెప్పారు.

యాజమాన్యానికి నోటీసులు..

విద్యార్థులపై సంసిద్ స్కూల్ హాస్టల్ వార్డెన్ అకృత్యాలకు పాల్పడినట్లు సమాచారం అందడంతో డీఈఓ నాగరాజు, డిప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు సోమవారం స్కూలు కెళ్లి విచారణ చేపట్టారు. వార్డెన్ ప్రవర్తనపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్కూలు యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు.

స్కూల్ గుర్తింపు రద్దు చేయాలి..

సంసిద్ ఇంటర్నేషనల్ స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం డీఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమణయ్య, కుళ్లాయిస్వామి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్ మాట్లాడుతూ సంసిద్ స్కూల్ హాస్టల్ వార్డెన్ నిత్యం మద్యం తెచ్చుకుని తాగుతున్నాడన్నారు. మద్యం మత్తులో విద్యార్థులను విచక్షణారహితంగా చావబాదుతున్నాడన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేసి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు వంశీ, మంజు, పవన్, హరి, విశ్వ, రారాజు, శామ్యూల్, సిద్దు, గిరి, భీమేష్, సోము, చంద్రకాంత్, నందన్ పాల్గొన్నారు.

చీనీలో 'యాజమాన్యం' తప్పనిసరి

- రెడ్డిపల్లి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త మల్లేశ్వరి



బుక్కరాయసముద్రం: చీనీలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) కో - ఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి తెలిపారు. సోమవారం ఆమె 'సాక్షి'తో మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 73,340 హెక్టార్లలో చీనీ తోటలు విస్తరించి ఉన్నాయన్నారు. అయితే సరైన యాజమాన్య పద్ధతులు పాటించకపోవడంతో చీనీ చెట్లు నిస్సారమవుతున్నాయన్నారు. ఈ క్రమంలో రైతులు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను ఆమె వివరించారు.

సమగ్ర ఎరువుల యాజమాన్యం

నేలలో కర్బన శాతాన్ని పెంచేందుకు చీనీ మొక్కల మధ్య అంతర పంటగా 25 కిలోల జనుము పెంపకాన్ని చేపట్టాలి. 50 శాతం పూత వచ్చిన తర్వాత ఈ పచ్చిరొట్టను భూమిలో కలియదున్నాలి. అనంతరం 25 శాతం పశువుల ఎరువు, 25 శాతం చెక్క, 50 శాతం సేంద్రియ ఎరువులు వేయాలి. నత్రజని, పొటాష్ ఎరువులను రెండు దఫాలుగా వేయాలి. కాయ పెరిగే సమయంలో పోషకాలను వేస్తే మంచి దిగుబడి సాధించవచ్చు. 500 గ్రాముల యూరియా, 250 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవడం ఎంతో మంచిది.

సూక్ష్మ ధాతువు లోపాల నివారణ

చీనీ సాగులో లేత ఆకులు విచ్చుకున్న దశలో 15-20 రోజుల వ్యవధిలో సూక్ష్మధాతు మిశ్రమాన్ని రెండు సార్లు పిచికారీ చేయాలి. వంద లీటర్ల నీటికి 500 గ్రాముల జింక్ సల్ఫేట్, 200 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్, 200 గ్రాముల ఫెర్రస్‌సల్ఫేట్, 100 గ్రాముల బోరాన్, 1 కిలో యూరియా కలిపి పిచికారీ చేయాలి.



పూత, పిందె రాలకుండా


చీనీ పూత, పిందె దశలో ఉన్నప్పుడు వేర్లు ఉన్న పాంతాన్ని కదిలించ రాదు. డ్రిప్పు ద్వారా నీటి తడులను సక్రమంగా ఇవ్వాలి. 9 లీటర్ల నీటికి 2 మి.లీ. ప్లానాఫిక్స్ కలిపి పిచికారీ చేయాలి. ఒక వేళ తెగుళ్ల సోకి పిందె రాలుతుంటే లీటరు నీటికి 1 గ్రాము కార్బండజిమ్ కలిపి పిచికారీ చేయాలి. ఇలా 10 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేస్తే మంచి ఫలితాలు ఉంటాయి.

కాయ నాణ్యత కోసం

చీనీ కాయ నాణ్యతకు రైతులు చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడు ఒక లీటరు నీటికి 10 గ్రాముల పొటాషియం నైట్రేట్ (13.0.45) చొప్పున కలిపి 20 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. కాయలో నునుపుదనాన్ని పెంచేందుకు లీటరు నీటికి 5 గ్రాముల సల్ఫేటు ఆఫ్ పొటాష్ కలిపి కాయ కోయడానికి నెల రోజుల ముందు పిచికారీ చేయాలి.

రహదారి చుట్టూ రాజకీయం

- రూ.4 కోట్లతో ధర్మవరంలో నాలుగు వరుసల రహదారి నిర్మాణం
- సొంత నిధులతో రోడ్డు వేస్తామంటూ ప్రతిపక్షాల డ్రామా



ధర్మవరం పట్టణంలో ఫోర్ లేన్ రహదారి నిర్మాణం కోసం కొలతలు వేస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు

ధర్మవరం: ఎన్నికల వేళ ప్రతిపక్ష పార్టీలు ప్రతి అంశాన్నీ రాజకీయం చేస్తున్నాయి. ముఖ్యంగా ధర్మవరంలో ఈ పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. తాము చేసిన తప్పును అధికార పార్టీపై తోసేందుకు సిద్ధమయ్యాయి. ఈ క్రమంలో పట్టణంలోని ప్రధాన రోడ్డును ప్రతిపక్షాలు ఓటు లబ్ధికి వాడుకుంటున్నాయి. టీడీపీ హయాంలో కమీషన్లకు కక్కుర్తి పడి వేసిన నాసిరకం రోడ్డు పాడైపోగా, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో నాలుగు వరుసల రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. టెండర్లు కూడా పూర్తయ్యాక తామే సొంత నిధులతో రోడ్డు వేస్తామని ప్రకటనలు చేస్తూ జనం వద్ద క్రెడిట్ కొట్టేయాలని విపక్షాల నేతలు చూస్తున్నారు.

ఏడాదికే గుంతలమయం

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ధర్మవరం పట్టణంలో ప్రధాన రహదారి నిర్మించారు. అప్పటి ఎమ్మెల్యే వరదాపురం సూరి కమీషన్లకు కక్కుర్తి పడడంతో కాంట్రాక్టర్ నాసిరకం పనులు చేసి, చేతులు దులుపుకున్నారు. ఫలితంగా ఏడాది తిరగకనే తారు మొత్తం కరిగిపోయి కంకర తేలింది. దీంతో ఈ దారిపై ప్రయాణం నరకం కాగా, ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రజల ఇబ్బందులు గుర్తించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి సమస్యను సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నాలుగు వరుస రహదారి నిర్మాణానికి ఆమోదం తీసుకువచ్చారు. రూ.4 కోట్లు నిధులు విడుదల చేస్తూ 2023 డిసెంబర్ 5వ తేదీన ప్రభుత్వం జీఓ జారీ చేసింది. దీంతో అధికారులు రోడ్డు నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ సైతం పూర్తి చేశారు. మంగళవారం నుంచి పనులు ప్రారంభించేందుకు అన్ని ప్రక్రియలూ పూర్తి చేశారు. నాగలూరు నుంచి పట్టణంలోని ఎర్రగుంట వై జంక్షన్ వరకు 6.62 కి.మీ పరిధిలో బీటీరోడ్డు వేసేందుకు రంగం సిద్ధమైంది. వదులు నేల ఉన్న ప్రాంతంలో సీసీరోడ్డు వేయాలని నిర్ణయించారు.

ప్రతిపక్షాల దుష్ప్రచారం

టీడీపీ హయాంలో దెబ్బతిన్న రోడ్డు స్థానంలో వైఎస్ జగన్ ప్రభుత్వం నూతనంగా నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టడంతో ప్రతిపక్ష టీడీపీ, బీజేపీలు దుష్ప్రచారం మొదలు పెట్టాయి. ఎల్లో మీడియా అండతో గుంతలమయమైన రోడ్డు అంటూ ప్రభుత్వంపై బురదజల్లుతూ ప్రచారం తీవ్రతరం చేయించారు. ఇక మాజీ ఎమ్మెల్యే వరదాపురం సూరి అయితే మెగా డ్రామాను మొదలు పెట్టారు. స్వతహాగా కాంట్రాక్టర్ అయిన సూరి... రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు విడుదల చేయడం, టెండర్ ప్రక్రియ పూర్తయిన విషయం తెలుసుకుని కొత్త నాటకానికి తెరతీశారు. తాను సొంత నిధులతో రోడ్డు వేయిస్తానని, ఇందుకు అనుమతి ఇవ్వాలంటూ ఆర్‌అండ్‌బీ అధికారులకు వరుసగా వినతిపత్రాలు ఇస్తూ వచ్చారు. అయితే రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో పాటు టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి చేసిందని చెప్పినా..సూరి మాత్రం ఎల్లో మీడియా ఎదుట మొసలి కన్నీరు కారుస్తూ నాటకం రక్తికట్టించారు. రోడ్డు తానే వేస్తున్నానని చెబుతూ క్రెడిట్ కొట్టేయాలని నానా పాట్లు పడుతున్నారు. అన్నీ తెలిసిన జనం ఈ పబ్లిసిటీ స్టంట్ చూసి విస్తుపోతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గోరంట్ల: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని గుంతపల్లి సమీపంలో పుట్టపర్తి - గోరంట్ల ప్రధాన రహదారిపై చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. గడ్డం తండాకు చెందిన శివనాయక్ (32), చక్రీబాయి భార్యాభర్తలు. వీరికి దేవాంశనాయక్, అశ్వినీబాయి సంతానం. పిల్లలకు పానీపూరి తినిపించేందుకు సోమవారం సాయంత్రం బైకుపై శివనాయక్ గోరంట్ల వచ్చాడు. తిరిగి తండాకు వెళ్తుండగా, గుంతపల్లి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన శివనాయక్‌ను స్థానికులు 108లో గోరంట్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు హిందూపురం ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడకు తరలిస్తుండగా, మార్గమధ్యలోనే శివనాయక్ ప్రాణాలు విడిచాడు. తండ్రితో పాటు ఉన్న చిన్నారులు సురక్షితంగా ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బీఎల్‌ఓల సస్పెన్షన్

తాడిపత్రి: విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ముగ్గురు బీఎల్‌ఓలను సస్పెండ్ చేస్తూ కలెక్టరగౌతమి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియలో భాగంగా చనిపోయిన వారిని గుర్తించి, జాబితా నుంచి వారి పేర్లను తొలగించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఉత్తర్వులు అందుకున్న వారిలో యాడికిలోని 85, 86 పోలింగ్ స్టేషన్ల బీఎల్‌ఓలు ఆదిలక్ష్మి, కృష్ణాంజలి, ఇదే మండలం కోనుప్పలపాడులోని 91, 92 పోలింగ్‌స్టేషన్ల బీఎల్‌ఓ గౌతమ బుద్ధుడు ఉన్నారు.

చింతపండు @ 26,525



హిందూపురం అర్బన్: చింతపండు ధరలు మార్కెట్‌లో ఆశాజనకంగా ఉన్నాయి. హిందూపురం వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం 788 క్వింటాళ్ల చింతపండును రైతులు, చిల్లర వ్యాపారులు తీసుకురాగా.. ఈ-నామ్ పద్ధతిలో వేలం వేశారు. కరిపులి రకం (ప్రథమశ్రేణి) క్వింటా గరిష్ఠంగా రూ.26,525, రూ.కనిష్టంగా 8,050, సగటున రూ.15,000 మేర పలికింది. ఇక ఫ్లవర్ రకం చింతపండు క్వింటా గరిష్ఠంగా రూ.11,000, కనిష్టంగా రూ.4,000, సగటున రూ.5,500 ప్రకారం క్రయ విక్రయాలు జరిగినట్లు మార్కెట్ కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



మృతి చెందిన వెంకటేష్

చిలమత్తూరు: మండలంలోని కొడికొండ -కందుర్పర్తి మార్గంలోని పొలాల్లో కల్లుకుంటకు చెందిన వెంకటేష్ (40) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సోమవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి బంధువులు సాధారణ మరణం అని చెప్పారని, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడని చెప్పారని ఎస్ఐ గంగాధర్ తెలిపారు. ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

సెల్ఫీ వీడియో తీసి ఆత్మహత్యాయత్నం



ఆసుపత్రిలో కృష్ణ

ధర్మవరం అర్బన్: కుటుంబ కలహాలతో మున్సిపల్ అటెండర్ కృష్ణ ఆత్మహత్యాయత్నం చేశాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. ధర్మవరం మున్సిపల్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేసే కృష్ణ సోమవారం తన కుటుంబ సమస్యలతో ఆత్మహత్య చేసుకుంటున్నానని సెల్ఫీ వీడియో తీశాడు. అనంతరం స్నేహితులకు పంపి వాజిమోల్ తాగాడు. గమనించిన మున్సిపల్ సిబ్బంది అతనిని వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

డ్రైవర్లు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలి



వాహనదారులకు కంటి పరీక్ష చేయిస్తున్న ఆర్టీఓ సురేష్‌నాయుడు

అనంతపురం సెంట్రల్: వాహనదారులు ఆరోగ్య విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్టీఓ సురేష్‌నాయుడు సూచించారు. సోమవారం రహదారి భద్రతా మాసోత్సవాలు సందర్భంగా డీటీసీ వీర్రాజు ఆదేశాల మేరకు రవాణాశాఖ కార్యాలయంలో వాహనదారులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. రాత్రి సమయాల్లో వాహనాలు నడిపే డ్రైవర్లు ఆరోగ్య విషయంతో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా నిద్రలేకుండా వాహనాలు నడపడం, మద్యం, ఇతరత్రా మత్తు పదార్థాలు తీసుకోవడం అనర్థాలకు దారి తీస్తుందన్నారు. దీర్ఘకాలిక జబ్బులకు దారి తీసే అవకాశం ఉందని హెచ్చరించారు. వాహన డ్రైవర్లు ఎప్పటికప్పుడు తాగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసులు, ఆప్తమాలజిస్టు డాక్టర్ జమిలాబేగం తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష పే చర్చా కార్యక్రమం వీక్షణ



మోదీ ప్రసంగాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు

అనంతపురం: పరీక్ష పే చర్చా కార్యక్రమానికి సంబంధించి భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగాన్ని సెంట్రల్ స్కూల్ విద్యార్థులు సోమవారం వీక్షించారు. ఈ ప్రత్యక్ష ప్రసారాన్ని అన్ని తరగతుల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వీక్షించారు. కార్యక్రమం అనంతరం ప్రిన్సిపాల్ కరీంఖాన్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థులు పరీక్షలంటే భయాందోళనలకు గురికాకుండా, వారిలో మానసిక ఉత్సాహం నింపుతాయన్నారు.


పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో 'పుస్తక ఆవిష్కరణ'



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: 'విదేశీ విశ్వవిద్యాలయాలకు అనుమతులు, సామాజిక సంక్షోభ సుడిగుండంలో విద్యారంగం' అనే అంశంపై పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రూపొందించిన పుస్తకాన్ని సోమవారం ఆవిష్కరించారు. నగరంలోని కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. తెలుగు అధ్యాపకులు ఎస్. రసూల్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. పీడీఎస్ఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. సురేష్ మాట్లాడుతూ విద్యా కార్పొరేటీకరణ, కాషాయీకరణ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానం - 2020 తీసుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో పీడీఎస్ఓ కోకన్వీనర్ సంజీవరాజు, ప్రోగ్రాం కోఆర్డినేటర్స్ అనిల్, అష్రాఫ్ వలి, కమిటీ సభ్యులు సంపత్, నవీన్, ముని, శివ, నారాయణ స్వామి, జస్వంత్, క్రీస్తీ బాబు, ఆది, అభిలాష్, లోకేష్, బాలు పాల్గొన్నారు.

లోవోల్టేజీ సమస్య పరిష్కరించండి



తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు


కనగానపల్లి: వ్యవసాయ విద్యుత్ సరఫరా లోవోల్టేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు మహదేవ, గోవిందు అధికారులను కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో రైతు సమస్యలపై వారు తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు పి.నాగరాజు, కార్యదర్శులు ఈశ్వరయ్య, ప్రసాద్, సీపీఐ మండల కార్యదర్శి బాలరాజు, రైతులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన

బుక్కరాయసముద్రం: నీలాంపల్లి, జంతలూరు, చెదుల్ల, రెడ్డిపల్లి, రోటరీపురం, కొర్రపాడు, నీలారెడ్డిపల్లి గ్రామాల్లో ఈవీఎంలపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సెక్టార్ అధికారి, ఏఓ శ్యాం సుందర్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల దృష్ట్యా ఓటింగ్ యంత్రాలపై ఓటర్లు అవగాహన పొందాలన్నారు. కంట్రోల్ బ్యాలెట్, వీవీ ప్యాట్‌లతో ప్రజలకు అవగాహన కల్పించారు. వీఆర్ఓలు వెంకట నారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, శంకరయ్య, సచివాలయ పోలీసు కార్యదర్శి శైలజ, స్వప్న, బీఎల్ఓలు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా స్టాంపు విక్రయాలు

- ఈ–స్టాంపులు అధిక ధరలకు విక్రయాలు
- రూ.100 స్టాంపు రూ.170కు అమ్ముతున్న వైనం



అనంతపురం టౌన్:
తాడిమర్రి మండలం మరువపల్లికి చెందిన భరత్ రూ.100 ఈస్టాంపు కోసం అనంతపురంలోని రామ్‌నగర్ రిజిస్ట్రార్ కార్యాలయం పక్కనే ఉన్న ఓ స్టాంప్ వెండర్‌తో రూ.100 స్టాంపు కొనుగోలు చేశాడు. ఆ స్టాంప్ వెండర్ రూ.100 స్టాంపు కోసం ఏకంగా రూ.170 తీసుకున్నాడు. స్టాంప్ ధర కంటే అదనంగా రూ.70 తీసుకున్నాడు. ఒకే సారి అదనంగా రూ.70 తీసుకుంటే ఎలా? అని ప్రశ్నిస్తే.. మీకు స్టాంపు కావాలంటే అదనంగా ఇచ్చుకోవాల్సిందేనని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడు. స్టాంపు విక్రేత చేసేదేమీ లేక అదనంగా చెల్లించాల్సి వచ్చింది.

మ్యాన్యువల్ విధానం రద్దు చేసినా...

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో అక్రమాలను అడ్డుకట్ట వేసేందుకు నూతన సాంకేతిక విధానాన్ని ప్రవేశపెట్టారు. మ్యాన్యువల్ విధానంలో స్టాంప్‌ల విక్రయాలను పూర్తి స్థాయిలో రద్దు చేసి ఈ స్టాంపింగ్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ విధానంతో పాత తేదీలతో స్టాంపుల విక్రయాలు పూర్తి స్థాయిలో బంద్ అయ్యాయి. దీంతో పాత తేదీలతో స్టాంపులను కొనుగోలు చేసుకొని అగ్రిమెంట్లు చేసుకునే విధానాన్ని పూర్తి స్థాయిలో రిజిస్ట్రేషన్ శాఖ అరికట్టగలిగింది. అయితే ప్రస్తుతం స్టాంపు వెండర్లు ఈ స్టాంపులను అధిక ధరలకు విక్రయిస్తూ వినియోగదారులపై అదనపు భారం వేస్తున్నారు.

అదనంగా చెల్లించాల్సిందే:

రిజిస్ట్రేషన్ శాఖ ఈ స్టాంపింగ్ విధానం అమలులోకి రావడంతో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ రూ.100, రూ. 50 స్టాంపులను మ్యాన్యువల్ విధానంలో విక్రయించే విధానాన్ని పూర్తి స్థాయిలో రద్దు చేసి, ఈ– స్టాంపింగ్ విధానాన్ని ప్రవేశపెట్టింది. స్టాంపులు కావాల్సిన వినియోగదారులు పేరు, చిరునామా తెలిపితే ఈ స్టాంపులను అందజేస్తారు. అనంతపురం పట్టణంలో 10 మంది 15 మంది దాకా ఈ స్టాంపింగ్ వెండర్లు ఉన్నారు. వీరితోపాటు రిజిస్ట్రేషన్ శాఖ డిపార్ట్‌మెంట్ ఈ స్టాంపుల విక్రయాలను చేపట్టలేదు. డిపార్ట్‌మెంట్ స్టాంపుల విక్రయాల కోసం ఓ ప్రైవేట్ వ్యక్తులకు కాంట్రాక్టు ఇచ్చింది. ఈ స్టాంప్ వెండర్లు అనంతపురం నగరంలో తక్కువ మంది ఉండడంతో ఇష్టారాజ్యంగా స్టాంపుల విక్రయాలను చేస్తున్నారు. ప్రైవేట్ స్టాంప్ వెండర్లు రూ.100 స్టాంపును డిమాండ్‌ను బట్టి రూ.170 నుంచి రూ.200దాకా విక్రయిస్తున్నారు. రూ.50 స్టాంప్‌ను రూ.100కు విక్రయించేస్తున్నారు. రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ స్టాంపింగ్ కౌంటర్‌లో సైతం స్టాంప్ ధర కంటే అదనంగా రూ.30 నుంచి రూ.40 దాకా చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లా వ్యాప్తంగా రోజువారిగా వందల సంఖ్యలో డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు జరుగుతుందటాయి. ప్రతి డాక్యుమెంట్‌కు రూ.100 స్టాంపులతోపాటు రూ.500 స్టాంపులు దాదాపు 5వరకు అవసరం ఉంటాయి. రోజువారిగా వేల సంఖ్యలో ఈ స్టాంపులు అవసరం ఉంటుంది. ఈ స్టాంపింగ్ విక్రయాలపై స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో స్టాంప్ వెండర్లు స్టాంపులను అధిక ధరలకు విక్రయించేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి ఈ స్టాంపుల అధిక ధరల విక్రయాలపై చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

ఈ – స్టాంపులను అధిక ధరలకు విక్రయించే స్టాంప్ వెండర్లపై చర్యలు తీసుకోవడంతో పాటు లైసెన్సులను రద్దు చేస్తాం. అధిక ధరలకు స్టాంపులను విక్రయాలు చేస్తున్న వెండర్లపై నేరుగా పిర్యాదు చేయాలని వినియోగదారులకు పిలుపు నిచ్చారు.

– పీవీఎస్ బాబు, జిల్లా రిజిస్ట్రార్

నేడు భవానీనగర్‌లో 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'

అనంతపురం ఎడ్యుకేషన్: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చేపడుతున్న 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ' కార్యక్రమం చేపడుతున్నారు. అందులో భాగంగా పాతూరులోని భవానీనగర్‌లో మంగళవారం ఉదయం 7:30 గంటలకు కార్యక్రమం నిర్వహిస్తున్నారు. భవానీనగర్ మొదటి రోడ్ ఆటో స్టాండ్(చెరువు కట్ట కింద) నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు.

విత్తన దుకాణం ఎదుట రైతు సంఘం ధర్నా

అనంతపురం అగ్రికల్చర్: నాసిరకం కళింగర విత్తనాలతో రైతులు నష్టపోయారని రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని రేవతి సీడ్స్ దుకాణం ఎదుట సోమవారం ధర్నా చేశారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ నార్పల మండలం బండ్లపల్లికి చెందిన 8 మంది రైతులు మాక్స్ కంపెనీకి చెందిన బీఎస్ఎఫ్ రకం కళింగర విత్తనాలు తీసుకెళ్లి 25 ఎకరాల్లో సాగు చేశారని, దిగుబడి లేక తీవ్రంగా నష్టపోయారన్నారు. రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏడీఏ రవి, ఏఓ సాయిలక్ష్మి చేరుకొని బాధిత రైతులు, రైతు సంఘం నాయకులు, కంపెనీ ప్రతినిధులతో మాట్లాడారు. నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తామని హామీఇచ్చారు.

సాంకేతికతతోనే ఉజ్వల భవిష్యత్

- జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

అనంతపురం రూరల్: విద్యార్థులు సాంకేతికను అందిపుచ్చుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అన్నారు. సోమవారం పీవీకేకే డిప్లమా కళాశాలలో స్వాధ్యాయ 2024 పేరిట సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జేసీ కేతన్‌గార్గ్, ఎస్కేయూ ప్రొఫెసర్ వెంకటరమణ, పీవీకేకే కళాశాల చైర్మన్ పల్లె కృష్ణకిశోర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివితేనే భవిష్యత్తు ఉంటుందన్నారు. క్రమశిక్షణతో మెలగడంతో పాటు తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవించాలన్నారు. విద్యార్థి దశ నుంచే సాంకేతికను అందిపుచ్చుకుంటేనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా దక్కుతాయన్నారు.



విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

విద్యార్థుల్లో దాగి ఉన్న వైజ్ఞానిక అభిలాష, అన్వేషణ దృక్పథాన్ని పెంపొందించడానికి ఇలాంటి సైన్స్ ఎగ్జిబిషన్లు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వైభవ్, సిబ్బంది శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు పరిశీలన



శిరివరంలో ఈ క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ రవి

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా రబీలో పంటలు సాగుచేసిన రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలని ఏడీఏ రవి పేర్కొన్నారు. శిరివరం, కనంపల్లిలో జరుగుతున్న ఈక్రాప్ పంట నమోదును సోమవారం ఆయన పరిశీలించారు. మండల వ్యాప్తంగా 90 శాతం(1800 ఎకరాల్లో) ఈ క్రాప్, ఈకేవైసీ పూర్తి చేశారన్నారు. మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సహ చట్టంపై అవగాహన అవసరం

అనంతపురం కల్చరల్: సమాచార హక్కు చట్టం ప్రాశస్త్యాన్ని వివరిస్తూ లఘుచిత్రాన్ని నిర్మించి షార్ట్‌ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రథమ బహుమతి దక్కించుకున్న దర్శకుడు తరిమెల రాజు, నిర్మాత, నటుడు కేపీ రాజులను స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సోమవారం అభినందించారు. స్థానిక కమలానగర్‌లోని గీతాంజలి ఆర్ట్స్ అకాడమీలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సామాజిక సేవా కార్యకర్త కమలనాథ్ మాట్లాడుతూ అనంత ఖ్యాతిని నలుదిశలా చాటేలా జిల్లా లఘుచిత్రోత్సవం జరిగితే, అందులో పెద్ద నగరాలవారితో పోటీ పడుతూ అనంత వాసులు నిర్మించిన 'ద పవర్ ఆఫ్ కామన్ మ్యాన్' లఘు చిత్రం ప్రథమ బహుమతి దక్కించుకోవడం హర్షణీయమన్నారు.



దర్శకుడు తరిమెల రాజు, నటుడు కేపీ రాజులను అభినందిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

సినీ దర్శకుడు రషీద్ బాషా కూడా అనంత వాసికావడం ఇక్కడి యువత మరింత రాణించడానికి అవకాశముందన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలో రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు నగర మేయర్ వసీం పేర్కొన్నారు. నగరంలోని 9,10 డివిజన్ల పరిధిలోని రాణీనగర్, మీనా మసీదు ప్రాంతంలో రూ. 29 లక్షలతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు పనులను డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయ భాస్కర్ రెడ్డితో కలసి మేయర్ సోమవారం పరిశీలించారు. మేయర్ మాట్లాడుతూ పేదలు అధికంగా నివసించే ప్రాంతాలను అభివృద్ధి చేయకుండా గత పాలకులు పూర్తిగా విస్మరించారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన నాలుగున్నరేళ్లలోనే అన్ని డివిజన్లలో రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు నిర్మించినట్లు తెలిపారు. పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకున్నామన్నారు. 15వ ఆర్థిక నిధులు, గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమ నిధులు రూ.20 లక్షలు, ఎమ్మెల్యే అనంత కృషితో మంజూరైన స్పెషల్ గ్రాంట్ రూ.25 కోట్లు వెచ్చించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్పొరేటర్లు సైపుల్లా బేగ్, అబూసాలెహ, ఇషాక్, లాలూ, వైఎస్సార్‌సీపీ నాయకులు గంగాధర్, తిరుపాల్‌రెడ్డి, డీఈ శేఖర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్లు

నేడు కసాపురంలో టెండర్లు

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకూ ఆలయంలో నిర్వహించే పలు పనులకు మంగళవారం ఉదయం 11గంటలకు టెండర్లు నిర్వహించనున్నట్లు ఈవో విజయ్‌సాగర్ బాబు తెలిపారు. భక్తులు స్వామివారికి సమర్పించిన తలనీలాలు, కొబ్బరి చిప్పలు, వాహనాల టోల్‌గేట్, బియ్యం బేడల సేకరణ, శానిటేషన్, సెల్‌ఫోన్లు, కెమెరాలు భద్రపరచుట, వివిధ రకాల సరుకుల పంపిణీ తదితర పనులకు షీల్డు, ఈ టెండర్‌తోపాటు, బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు.

శాస్త్రీయ పరిష్కారాలు కనుక్కోవాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి నాగరాజు

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యార్థులు అటల్ ల్యాబ్స్‌ను పూర్తి స్థాయిలో వినియోగించుకుని స్థానికంగా గుర్తించిన సమస్యలకు శాస్త్రీయ పరిష్కారాలను కనుక్కోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి వి.నాగరాజు సూచించారు. స్థానిక నంబర్–2 ప్రభుత్వ పాఠశాలలో టింకరింగ్ ల్యాబ్స్‌పై విజ్ఞాన ఆశ్రమం, యూనిసెఫ్ సౌజన్యంతో మూడు రోజుల వర్క్‌షాపు సోమవారం ప్రారంభమైంది. వర్క్‌షాపును డీఈఓ నాగరాజు ప్రారంభించారు. గార్లదిన్నె, పామిడి, రాప్తాడు మోడల్ పాఠశాలలకు చెందిన 25 మంది విద్యార్థులు, కురుగుంట అంబేద్కర్ గురుకుల పాఠశాలకు చెందిన 10 మంది విద్యార్థులకు విజ్ఞాన్ ఆశ్రమానికి చెందిన మనోజ్, కృష్ణ సైన్స్‌కు చెందిన ప్రాజెక్టులను అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌లో ఎలా తయారు చేయాలో వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర యూనిసెఫ్ కోఆర్డినేటర్ సుదర్శన, జిల్లా సైన్స్ అధికారి బాలమురళీ కృష్ణ, ప్రధానోపాధ్యాయులు నవీదా, ఆయా పాఠశాలల నోడల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వర్క్‌షాపులో పాల్గొన్న విద్యార్థులు

రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలకు చెక్

యాడికి: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని తాడిపత్రి ఎంవీఐ(మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్) రాజగోపాల్ సూచించారు. సాగర్ సిమెంట్ కర్మాగారం వద్ద సోమవారం 35వ రహదారి భద్రతా వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కారు, జీపు, లారీ డ్రైవర్లతో సమావేశమై వారికి సూచనలు, సలహాలు ఇచ్చారు. అతివేగం, సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం, తాగి డ్రైవ్ చేయడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వంటి కారణాల వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్, కార్లలో వెళ్లేవారు సీటు బెల్టు ధరించాలని సూచించారు. అనంతరం సాగర్ సిమెంట్ వైద్య బృందంతో డ్రైవర్లకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సాగర్ సిమెంట్ యూనిట్ హెడ్ రంగారెడ్డి, మేనేజర్ నాగేశ్వర రావు, అసిస్టెంట్ మేనేజర్ శ్రీమన్నారాయణ, ఎస్ఓ వలి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంవీఐ రాజగోపాల్

నంది అవార్డు గ్రహీతలకు అభినందనలు

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక కోర్టు రోడ్డులోని శ్రీ చైతన్య పాఠశాలలోని నంది అవార్డు గ్రహీతలను ఏజీఎం సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ తబస్సుమ్ అభినందించారు. ఈ మేరకు సోమవారం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఏడో తరగతి సి–బ్యాచ్ విద్యార్థి ఏ. ముని తన్విష్, 9వ తరగతి విద్యార్థిని ఏ.మునిగ్రీష్మిత ఇద్దరూ 'బాధ్యత' అనే నాటకంలో నటించారు. ఏఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని మురళీకృష్ణ చేతుల మీదుగా నంది అవార్డును గుంటూరులో శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఇటీవల అందుకున్నారు. 'చెట్లు పచ్చదనానికి ప్రతీకలు.. ఇవి వాతావరణ కాలుష్యాన్ని నియంత్రిస్తాయి.. చెట్లను ఎవరు కొట్టకూడదు.. వాటిని రక్షించుకోవాలి' అనే నినాదంతో పిల్లలు రూపొందించిన నాటకం అందరినీ ఆకట్టుకుందని ఏజీఎం సుబ్బారెడ్డి తెలిపారు. ఈ నాటికకు నంది అవార్డు దక్కిందన్నారు. ఇలాంటి విద్యార్థులకు ఉపాధ్యాయులు మంచి సహకారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల డీన్లు అప్పలనాయుడు, సిరాజుద్దీన్, మహేష్, కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఏఓ గోపాల్ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీచైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ తబస్సుమ్

రైతులకు పంట నష్ట పరిహారం ఇవ్వాలి

రాప్తాడు: పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని సీపీఎం రాప్తాడు కమిటీ సభ్యుడు పోతులయ్య తెలిపారు. మండలంలో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని సీపీఎం నాయకులు తహసీల్దార్ మునివేలు వినతి ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ పంటలు నష్టపోయిన రైతులకు పంట నష్ట పరిహారం, ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు కూలీలకు 200 రోజులు ఉపాధి పనులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శ్రీరాములు, నారాయణ, సుబ్బిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఖరీఫ్ సీజన్‌లో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని రైతు సంఘం నాయకులు తహసీల్దార్ షర్మిలకు సోమవారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రైతు సంఘం ఉపాధ్యక్షుడు శివశంకర్, రామయ్య, జయమ్మ, రాము, పెద్దన్న, వెంకట్‌రాముడు తదితరులు పాల్గొన్నారు .

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో సోమవారం ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. బ్రహ్మసముద్రం మండలానికి చెందిన హరిజన లింగప్ప పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో కుటుంబంతో కలసి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొడుకు పవన్ కళ్యాణ్ జీవితంలో స్థిరపడకపోవడంతో మనస్థాపం చెందిన ఆయన ఇంట్లో ఎవరూ లేని సమయంలో విష గుళికలు మింగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అతడిని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నేటి నుంచి కుష్టు వ్యాధి పక్షోత్సవాలు

గుత్తి రూరల్: గుత్తి రూరల్: గుత్తి డివిజన్ వ్యాప్తంగా మంగళవారం నుంచి కుష్టు వ్యాధి పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గుత్తి డివిజనల్ కుష్టు నియంత్రణ అధికారి వైద్యం వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. కాళ్లు, చేతి వేళ్లలో బలహీనత, కళ్లు మూసుకోవడంలో ఇబ్బంది, శరీరంపై స్పర్శలేని మచ్చలు, ఎరుపు రంగుతో కూడి ఉబ్బినట్టుగా ఉండే మచ్చలు, లావుగా, నొప్పిగా, నరాలకు జోము కలిగినట్టుగా ఉంటే అవి కుష్టు వ్యాధి లక్షణాలుగా గుర్తించాలన్నారు. మంగళవారం నుంచి ఫిబ్రవరి 13 వరకూ వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తారని, లక్షణాలు ఉన్నవారు పరీక్షలు చేయించుకొని,చికిత్సచేయించుకోవాలన్నారు.

సర్పంచుకు గాయాలు

విడపనకల్లు(ఉరవకొండ): ఉరవకొండ మండలంలోని నెరిమెట్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచు యోగేంద్రరెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. సోమవారం ఆయన ఉరవకొండకు ద్విచక్రవాహనంలో వెళ్తుండగా మార్గమధ్యలో బైకు అదుపుతప్పి కిందపడ్డాడు. ఘటనలో ఆయన కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. స్థానికులు అతడిని 108లో ఉరవకొండ ప్రభుత్వాస్పతికి తరలించారు.

పొలాలకు రోడ్డు వేసుకుంటే తప్పడు రాతలా?

- పచ్చ మీడియాపై మండిపడ్డ ఉల్లికల్లు రైతులు

శింగనమల: మండలంలోని ఉల్లికల్లు గ్రామంలో 150 ఎకరాల భూములకు వచ్చి వెళ్లేందుకు వీలుగా ఎంపీ నిధులతో రోడ్డు వేయించుకుంటే నిధులు స్వాహా అంటూ పచ్చ మీడియాలో వార్తలు రాశారని రైతులు మండిపడ్డారు. సోమవారం గ్రామ రైతులు సదరు రోడ్డు వద్దకు పాత్రికేయులను తీసుకెళ్లి వాస్తవాలను వివరించారు. ఎంపీ నిధులు రూ.10 లక్షలతో 1.25 కిలోమీటర్ల మేర రోడ్డు వేసుకున్నామన్నారు. అక్కడి నుంచి మరికొంత దూరం వరకు రైతులందరం కలిసి చందాలు వేసుకొని పొలాల వరకు రోడ్డు వేసుకున్నామన్నారు. అయితే పచ్చ మీడియాలో మాత్రం రోడ్డు వేయకుండా నిధులు స్వాహా చేశారని ఆరోపించడం ఎంతవరకు సమంజసమన్నారు. వీరికి ఈరోడ్డు కనిపించడం లేదా అని విమర్శించారు. పార్టీలకతీతంగా రోడ్డు వేసుకున్నామని, కొంత మంది తెలుగు తమ్ముళ్లు ఓర్వలేక పచ్చమీడియా ద్వారా ఆరోపణలు చేయిస్తున్నారని అన్నారు. విలేకరుల సమావేశంలో రైతులు పరంధామరెడ్డి, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.



ఉల్లికల్లులో ఎంపీ నిధులతో వేసుకున్న మట్టి రోడ్డును చూపుతున్న రైతులు

ప్రతిభ వెలికితీతకే 'ఆడుదాం ఆంధ్రా'

గుంతకల్లు: గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసి వారు జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహించేందుకే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని గుంతకల్లు ఆర్డీఓ వాకా శ్రీనివాసులురెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు నైరుతిరెడ్డి, మైమున్ అన్నారు. ఆడుదాం ఆంధ్రాలో భాగంగా 35 రోజులుగా స్థానిక రైల్వే క్రీడామైదనంలో గ్రామ, వార్డు సచివాలయ, మండల, నియోజకవర్గ స్థాయిలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, బాడ్మింటన్, ఖోఖో పోటీలు నిర్వహిస్తున్నారు. సోమవారం నియోజకవర్గ స్థాయి పోటీలు ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆర్డీఓ, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లతోపాటు, కమిషనర్ వెంకటరమణయ్య, తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటరమణ, ఎంఈఓలు మస్తాన్‌రావు, సుబ్బరాయుడు హాజరై మాట్లాడారు.

ఓవరాల్‌గా రాణించిన గుంతకల్లు

గుంతకల్లు క్రీడాకారులు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, బాల్‌బాడ్మింటన్, ఖోఖో పోటీల్లో రాణించి తొలిస్థానంలో నిలిచారు. క్రికెట్ పోటీల్లో పురుషుల విభాగంలో తొలి స్థానంలో గుంతకల్లు, రెండవ స్థానంలో పామిడి, మూడవ స్థానంలో గుత్తి జట్టు నిలిచాయి. అదేవిధంగా మహిళల విభాగంలో తొలి స్థానంలో పామిడి జట్టు నిలిచింది. మిగిలిన విభాగాల్లో కూడా గుంతకల్లు క్రీడాకారులు రాణించారు. విజేత జట్లకు మెడల్‌లతోపాటు కప్‌లను అందజేశారు. ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ కో ఆర్డినేటర్ సబిత, మండల కోఆర్డినేటర్ వేణుగోపాల్, పీడీలు పాల్గొన్నారు.



శింగనమల: మహిళా జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న డీసీఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి

తాడిపత్రి సుంకులమ్మపాలెం జట్టు విజేత

తాడిపత్రి అర్బన్: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో క్రికెట్ ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. యాడికి జట్టు, తాడిపత్రి సుంకులమ్మపాలెం జట్టు పోటీ పడ్డాయి. నిర్ణీత 10 ఓవర్లలో తాడిపత్రి సుంకులమ్మపాలెం జట్టు 97 పరుగులు సాధించింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన యాడికి జట్టు 10 ఓవర్లలో 68 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో తాడిపత్రి జట్టును విజేతగా ప్రకటించారు. తాడిపత్రి జట్టులో వినయ్(63),లక్ష్మణ్(25) పరుగులు సాధించారు. విజయం సాధించిన జట్టుకు మున్సిపల్ కమిషనర్ జి.రవి, వార్డు కౌన్సిలర్ ఎం.రంగనాథరెడ్డి రూ.35 వేలు నగదుతో పాటు ట్రోఫీ, పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు మెడల్స్ అందజేసి అభినందించారు.

జిల్లా స్థాయికి పలు జట్ల ఎంపిక

శింగనమల: శింగనమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నియోజకవర్గ స్థాయి మహిళా క్రికెట్ పోటీలు జరిగాయి. బుక్కరాయసముద్రం జట్టు విజయం సాధించి జిల్లా స్థాయికి ఎంపికైంది. రన్నర్‌ప్‌గా శింగనమల జట్టు నిలిచింది. అదేవిధంగా జిల్లా స్థాయికి పురుషుల క్రికెట్‌లో గార్లదిన్నె జట్టు, కబడ్డీ పోటీల్లో పురుషుల విభాగంలో నార్పల, మహిళా విభాగంలో గార్లదిన్నె జట్లు విజయం సాధించాయి. వాలీబాల్ పోటీల్లో పురుషుల విభాగంలో నార్పల, మహిళా విభాగంలో గార్లదిన్నె, బ్యాడ్మింటన్ పోటీల్లో పురుషుల విభాగంలో గార్లదిన్నె, మహిళా విభాగంలో నార్పల జట్లు విజయం సాధించాయి. ఖోఖోలో పురుషుల విభాగంలో బుక్కరాయసముద్రం, మహిళల విభాగంలో శింగనమల జట్టు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంపీడీఓ నిర్మలాకుమారి తెలిపారు. క్రికెట్‌లో గెలుపొందిన మహిళా జట్టుకు డీసీఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి కప్ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ యోగేశ్వరి, వైస్ ఎంపీపీ విజయ, కార్యదర్శులు పాల్గొన్నారు.